# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 09-04-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- అసోం, కేరళం రాష్ట్రాలతో పాటూ కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఈ సాయంత్రం ప్రశాంతంగా ముగిసింది.
- దేశంలో ప్రజాస్వామ్యాన్ని మరింత భాగస్వామ్యయుతంగా మార్చడానికి చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం అవసరమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు.
- పోషణ్ పఖ్వాడా-2026ను కేంద్రమంత్రి అన్నపూర్ణా దేవి న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు.
- పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితుల దృష్ట్యా కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పూరీ, ఎస్. శంకర్ రేపటి నుండి ఆ ప్రాంతంలోని దేశాలతో సంప్రదింపులు జరిపేందుకు పర్యటించనున్నారు.
- మంగోలియా వేదికగా జరిగిన ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు నాలుగు స్వర్ణ పతకాలను గెలుచుకున్నారు.

==========================

అసోం, కేరళం రాష్ట్రాలతో పాటూ.. కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అసోంలోని 126 స్థానాలకు, కేరళంలోని 140 స్థానాలకు, పుదుచ్చేరిలోని 30 శాసన సభ స్థానాలకు ఓటర్లు ఈరోజు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల వరకు అసోంలో 84.42 శాతం ఓటింగ్ నమోదైందని, కేరళంలో 75 శాతం, పుదుచ్చేరిలో 86.92 శాతం ఓటింగ్ నమోదైందని ఎనికల సంఘం వెల్లడించింది. పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశ పోలింగ్ నామినేషన్ల ఉపసంహరణకు, రెండో దశ పోలింగ్ నామినేషన్లు దాఖలు చేయడానికి నేటితో గడువు ముగిసింది. అసోం, కేరళం, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు వచ్చే నెల 4వ తేదీన జరుగుతుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారత ప్రజాస్వామ్యాన్ని మరింత చైతన్యవంతంగా, భాగస్వామ్యయుతంగా మార్చడానికి చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం అవసరమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ అంశంపై ఆయన అభిప్రాయాలను ఈరోజు ఒక పత్రికా వ్యాసంలో నరేంద్ర మోదీ పంచుకుంటూ… ఈ రిజర్వేషన్లను అమలు చేయడంలో ఏవైనా జాప్యం జరిగితే అది చాలా దురదృష్టకరమని అన్నారు. మహిళా రిజర్వేషన్లను ముందుకు తీసుకెళ్లే కీలక బిల్లుపై చర్చించి, ఆమోదించేందుకు ఈనెల 16న పార్లమెంటును సమావేశపరుస్తున్నట్లు ప్రధానమంత్రి తెలిపారు. 2029 లోక్‌సభ ఎన్నికలు, రాబోయే వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని ప్రధాని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య సంస్థల్లో మహిళలకు తగిన ప్రాధాన్యత కల్పించేందుకు గత ప్రభుత్వాలు ప్రయత్నించాయని గుర్తు చేశారు. దీనికోసం కమిటీలు వేశారని, బిల్లు ముసాయిదాలను ప్రవేశపెట్టారని, కానీ అవి ఎప్పుడూ చట్టరూపం దాల్చలేదన్నారు. సెప్టెంబర్ 2023లో పార్లమెంటు అదే ఏకాభిప్రాయంతో "నారీ శక్తి వందన్ అదినియం"ను ఆమోదించిందని నరేంద్ర మోదీ పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఔషధ ముడిసరుకుల ప్రపంచ సరఫరా గొలుసులో అంతరాయాలు ఏర్పడ్డాయని, ముఖ్యంగా క్రియాశీల ఔషధ పదార్థాలు (APIలు) ప్రభావితమయ్యాయని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. సవాళ్లు ఉన్నప్పటికీ దేశంలో ఔషధాల అమ్మకపు ధరలలో పెద్దగా పెరుగుదల లేదని తెలిపింది. ఔషధ పరిశ్రమకు మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం ఇటీవల 40 పెట్రోకెమికల్ ఉత్పత్తులపై కస్టమ్స్ సుంకాన్ని సున్నాకు తగ్గించిందని ఆ శాఖ సంయుక్త కార్యదర్శి టి.ఎల్. సత్యప్రకాష్ ఈరోజు న్యూ ఢిల్లీలో నిర్వహించిన అంతర మంత్రిత్వ శాఖల మీడియా సమావేశంలో గుర్తు చేశారు. గత 24 గంటల్లో భారతదేశ జెండా ఉన్న నౌకలకు సంబంధించి ఎలాంటి సంఘటనలు జరగలేదని ఓడరేవులు, నౌకాయానం, జలమార్గాల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. భారత జెండా ఉన్న ఎల్‌పీజీ నౌక "గ్రీన్ ఆశా" హార్మజ్ జలసంధిని దాటి సురక్షితంగా ముంబైలోని జెఎన్‌పి పోర్టుకు చేరుకుందని ఆ శాఖ సహాయ కార్యదర్శి ముఖేష్ మంగల్ వివరిస్తూ…

(వాయిస్ 29 సెకన్లు)

పశ్చిమాసియాలో మారుతున్న పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతంలోని దేశాలతో సంప్రదింపులు జరిపేందుకు భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ ఈ నెల 11, 12వ తేదీల్లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ లో పర్యటిస్తారని, పెట్రోలియం శాఖా మంత్రి హర్దీప్ సింగ్ పూరీ రేపటి నుండి రెండు రోజుల పాటూ ఖతార్ లో పర్యటిస్తారని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ వెల్లడించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమ బెంగాల్ లోని హల్దియాలో జరిగిన ఎన్నికల ప్రచారంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు పాల్గొన్నారు. హల్దియా టౌన్షిప్ లో జరిగిన బహిరంగ సభలో నరేంద్ర మోదీ ప్రసంగిస్తూ… పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో రైతుల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని చెప్పారు. రైతులతో పాటూ.. మత్స్యకారుల సంక్షేమానికి బీజేపీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంటూ…

(వాయిస్ 30 సెకన్లు)

అనంతరం అసన్సోల్, బీర్భూమ్ లోని సూరిలో జరిగిన ఎన్నికల ర్యాలీలలో నరేంద్ర మోదీ పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి `పోషణ్ పఖ్వాడా-2026`ను న్యూఢిల్లీలో ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పిల్లల ఎదుగుదల సమయంలో "జీవితంలోని మొదటి ఆరు సంవత్సరాలలో మెదడు అభివృద్ధిని గరిష్ఠ స్థాయికి చేర్చడం" అనే ఇతివృత్తంతో ఈ ఏడాది సామాజిక సంస్థలు స్థానిక సంస్థల భాగస్వామ్యంతో రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని అంగన్వాడీ కేంద్రాల ద్వారా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పోషణను ప్రజా ఉద్యమంగా చేపట్టడంలో పఖ్వాడా ఒక ప్రయత్నమని పేర్కొన్నారు. అంగన్వాడీ ఆశా కార్యకర్తలు ఈ ఉద్యమానికి వెన్నెముక వంటి వారని, ఆరోగ్య కేంద్రాల నుంచి గృహాల వరకు వారు విరామం లేకుండా పని చేస్తున్నారని కేంద్రమంత్రి కొనియాడారు.

(వాయిస్ 31 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మంగోలియా వేదికగా జరిగిన ఆసియా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళా బాక్సర్లు నాలుగు స్వర్ణ పతకాలను గెలుచుకొని దేశాన్ని పాయింట్ల పట్టికలో అగ్ర స్థానంలో నిలిపారు. 48 కేజీల విభాగంలో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ మీనాక్షి హూడా మంగోలియాకు చెందిన నోముందరి అమ్గలన్‌ను 5-0 తేడాతో ఓడించి స్వర్ణ పతకం కైవసం చేసుకున్నారు. 54 కేజీల విభాగంలో ప్రీతి పవార్, 60 కేజీల విభాగంలో ప్రియ, 70 కేజీల విభాగంలో అరుంధతి స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. నాలుగు స్వర్ణాలతో పాటూ రెండు రజతాలు, మూడు కాంస్య పతకాలు కలిపి మొత్తం 10 పతకాలతో ఆసియా బాక్సింగ్ ను ప్రధమ స్థానంలో ముగించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్ల మధ్య ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ ఓడి బ్యాటింగ్ ప్రారంభించిన కోల్‌కతా నైట్ రైడర్స్ 12 ఓవర్లు పూర్తయ్యే సరికి 3 వికెట్లు నష్టపోయి 106 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక రహానే 41, రఘువంశీ 45 పరుగులతో రాణించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77 వేల 562 పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమై.. చివరికి 931 పాయింట్ల నష్టంతో 76 వేల 631 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 222 పాయింట్లు నష్టపోయి 23 వేల 775 వద్ద స్థిరపడింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =